సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 6 । మే । 2025



పలువురికి గాయాలు 8లో

నాతవరం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు, కోటవురట్లలో జరిగిన ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు.



సమాచార కమిషనర్ రాక

విశాఖ విద్య: రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ శామ్యూల్ జోనాథన్ సోమవారం ఏయూని సందర్శించారు.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

లేటరైట్ తవ్వకాలు నిలిపివేయాలి

- గిరిజనుల హక్కులకు విఘాతం
- స్పీకర్ కల్పించుకోవాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం డిమాండ్



లేటరైట్ తవ్వకాలను పరిశీలిస్తున్న సీపీఎం కేంద్ర జిల్లా కమిటీ బృందం

నాతవరం: అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇలాకాలో జరుగుతున్న అక్రమ లేటరైట్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. అసనగిరి పంచాయతీ శివారు బమ్మిడికలొద్దు ప్రాంతంలో జరుగుతున్న లేటరైట్ తవ్వకాలను సోమవారం సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న లేటరైట్ తవ్వకాలను యుద్ధప్రాతిపదికన నిలుపుదల చేయకపోతే ఉద్యమిస్తామన్నారు. ఈ ప్రాంతం 1/70 యాక్టు పరిధిలో ఉందని, లేటరైట్ తవ్వకాల వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతుందన్నారు. రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులను ఉల్లంఘించి చేస్తున్న ఈ తవ్వకాల కారణంగా అడవి బిడ్డల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. గతంలో లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకించిన కూటమి నేతలు ఇప్పుడు ప్రోత్సహించడం సిగ్గు చేటన్నారు. ఇదే కొనసాగితే ఈ ప్రాంత గిరిజనులు జీవనం సాగిస్తున్న అటవీ సంపదతో పాటు జీడిమామిడి తోటలు నాశనం అవుతాయన్నారు. లేటరైట్ తవ్వకాలు ఆపకుంటే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ప్రాంత గిరిజనులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు, పార్టీ సీనియర్ నాయకుడు త్రిమూర్తులురెడ్డి, రాజవొమ్మంగి మండల పార్టీ కార్యదర్శి సూరిబాబు, ప్రజానాట్యమండలి నాయకుడు రమేష్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వేదికపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పీఏసీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు, పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

ఇక సమరమే..

వాగ్దానాలు విస్మరించిన కూటమి ప్రభుత్వం

ఏడాది పాలనలో అన్ని వర్గాలకూ కష్టాలే..

- **హనీమూన్ సమయం ముగిసింది**
- **ప్రజల పక్షాన పోరాటం చేద్దాం**
- రూ.వెయ్యి పింఛను పెంపు మినహా సంక్షేమం శూన్యం
- కూటమి నేతల అభివృద్ధికే లక్షల కోట్ల అప్పులు
- **చంద్రబాబు ఓ మాయల మరాఠీ**
- **వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా** విస్తృత స్థాయి సమావేశంలో శాసనమండలి విపక్ష నేత బొత్స
- పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అమర్‌నాథ్

హామీలన్నీ అటకెక్కాయి.. ప్రజల కష్టాలు తారస్థాయికి చేరాయి.. మాట నిలుపుకుంటారో లేదోనని ఏడాదిపాటు వేచి చూశాం.. హనీమూన్ సమయం ముగిసింది.. ఇక జనం గొంతుకై వారి పక్షాన పోరాటమే మన కర్తవ్యం.. అని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌పిలుపునిచ్చారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, అనకాపల్లి: పార్టీ శ్రేణుల హర్షధ్వానాల మధ్య వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రమాణ స్వీకారం సోమవారం అనకాపల్లిలో అట్టహాసంగా జరిగింది. రింగ్ రోడ్డులో గల పెంటకోట కన్వెన్షన్ హాల్లో పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అధ్యక్షతన జరిగిన వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో అమర్‌నాథ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. వాటిని పార్టీ కార్యకర్తలు చప్పట్లతో ఆమోదించారు. సమావేశానికి ముందు పార్టీ నేతలందరూ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. సమావేశానికి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 'చంద్రబాబు మాయల మాంత్రికుడు.. తన అనుకూల మీడియా ద్వారా లేనిది ఉన్నట్టు చూపించి ఊహల్లో విహరించేలా ప్రజలను తప్పుదోవ పట్టిస్తాడు.. మనమంతా అప్రమత్తంగా ఉండాలి.. ప్రజా సమస్యలను, కూటమి నేతల అవినీతిని ఎప్పటికప్పుడు ఎండగట్టాలి' అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల హామీల అమలుకు ప్రజల తరపున పోరాటం చేసే సమయం ఆసన్నమైందన్నారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించి.. వాటి పరిష్కారానికి పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో సామాన్యులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, చివరికి ఉపాధి హామీ కూలీల వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. వెయ్యి రూపాయల పెంచను పెంపు తప్ప కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిందేమీ లేదన్నారు. రూ.లక్షా 70 వేల కోట్లు అప్పు చేసి.. కూటమి నేతలు దోచుకుని తింటున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలో మీటింగ్ పెట్టండి.. ఆ ప్రాంతంలోని సమస్యలపై చర్చిద్దాం.. పోరాడదాం.. అన్నారు.

జగన్ 2.0లో కార్యకర్తలకు ప్రాధాన్యం



వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన **అధ్యక్షుడు** గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఈ సమావేశానికి హాజరైన పార్టీ కేడర్ జోష్ చూస్తుంటే తనలో ఉత్సాహం రెట్టింపయిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావడం **తథ్యమని** ధీమా వ్యక్తం చేశారు. ఏడాదికే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైంది.. ఇప్పుడు మన బాధ్యత మరింత పెరిగిందన్నారు. గతంలో **జరిగిన పొరపాట్లు మళ్లీ దొర్లకుండా** చూసుకుంటామని, **కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం** కల్పిస్తామన్నారు. **గత ఐదేళ్లలో మనం సృష్టించిన** వలంటీర్ **వ్యవస్థ** ప్రజలకు మేలు చేసింది **కానీ** వారికి పార్టీని దూరం చేసిందన్నారు. జగనన్న 2.0లో కార్యకర్తలకే అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని, **ఈ**సారి కార్యకర్తలను గుండె**ల్లో** పెట్టుకుని చూసుకుం**టానని వైఎస్** జగన్‌మోహన్‌రెడ్డి తన మాటగా మీకు చెప్పమన్నారన్నారు. సింహాచలం దుర్ఘటనలో ఏడుగురు చనిపోవడానికి ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఇంటర్నేషనల్ మేస్త్రి నంటావు కదా చంద్రబాబూ.. సింహాచలంలో ఏడడుగుల గోడనే నిర్మించలేకపోయావు.. అమరావతిని ఏమి నిర్మిస్తావు అంటూ ఎద్దేవా చేశారు.

కుటిల సర్కారు గద్దె దిగే రోజు వస్తుంది..



మాజీ డిప్యూటీ సీఎం, **పీఏసీ** సభ్యుడు ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. అమర్‌నాథ్ ప్రమాణ స్వీకారంతో తండ్రి తన చేతుల మీదుగా కుమారుడికి బాధ్యతలు అప్పగిస్తున్నంత ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతి**రేకత** ప్రారంభమైందని, త్వరలో రోడ్డెక్కి **మరీ ఈ** కుటిల సర్కారును గద్దె దించే రోజు వస్తుందన్నారు. కూటమి నాయకులు ఎన్నో దాడులు చేస్తున్నా.. పార్టీ శ్రేణులు ఎదురొడ్డి నిలుస్తున్నారన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ.. మీ అందరి ఉత్సాహం చూస్తే రానున్న స్థానిక, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్న సైనికుల్లా కనిపిస్తున్నారన్నారు. రాష్ట్రం అప్పుల ఆంధ్ర ప్రదేశ్‌గా మారిందని, అరాచకాలు **ఎక్కు**వయ్యాయన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ.. గతంలో జగనన్న పాలనలో ప్రతి పండగకు ఒక సంక్షేమ పథకం అందుకుని ప్రజలు నిజంగా పండగ చేసుకునే పరిస్థితి ఉండేదన్నారు. సమ**న్వయ**కర్తలు, మాజీ ఎమ్మెల్యేలు పెట్ల **ఉమాశంకర్** గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కన్నబాబు రాజు, కంబాల జోగులు, మలసాల భరత్ కుమార్, మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడారు. అరకు, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, సూర్యనారాయణరాజు, ముఖ్యనేతలు చింతకాయల సన్యాసిపాత్రుడు, ఈర్లె అనురాధ, చింతలపూడి వెంకట్రామయ్య, దంతులూరి దిలీప్ కుమార్, చిక్కాల రామారావు, రుత్తల ఎర్రాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో తీర్మానాలు ఇవే..

- మే నెలాఖరులోగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల అధ్యక్షులు, మండల కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి.
- జూలై 31వ తేదీలోగా గ్రామ కమిటీలు, బూత్ కమిటీలను నియమించాలి.
- ఆరు నెలలకొకసారి జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించుకోవాలి. ప్రతి నియోజకవర్గంలో ఒక విస్తృత స్థాయి సమావేశం నిర్వహించుకుందాం.
- ప్రతి నెలా ఒక మండలంలో పార్టీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలి.

మంత్రుల కమిటీ సంగతేంటి?

- సింహాచలం ఆలయంలో గోడ కూలిన ఘటనలో బాధ్యులపై చర్యలు
- ఆలయ ఇన్‌చార్జి ఈవోతో సహా ఆరుగురు అధికారుల సస్పెన్షన్
- కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణపై క్రిమినల్ చర్యలకు ఆదేశం
- మంత్రుల కమిటీ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నా చర్యల్లేవు..
- నిజాలను గోడ వెనకే సమాధి చేసేసిన త్రిసభ్య కమిషన్

సింహాచలం దేవస్థానంలో దుర్ఘటనపై కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. తప్పంతా అధికారులు, దిగువస్థాయి సిబ్బందిదే అన్నట్లుగా వారిపైనే వేటు వేసింది. దాసుని తప్పు దండనతోనే సరి అన్నట్లుగా.. పనుల పర్యవేక్షణ అంటూ ప్రచార ఆర్భాటానికి పరిమితమై.. భక్తుల ప్రాణాలతో చెలగాటమాడిన మంత్రుల కమిటీ మీద మాత్రం ఈగ వాలనీయకుండా జాగ్రత్తపడింది.

సాక్షి, విశాఖపట్నం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా తాత్కాలికంగా నిర్మించిన గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. త్రిసభ్య కమిషన్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు, ఈఈ డీజీ శ్రీనివాసరాజు, డిప్యూటీ ఈఈ కేఎస్ఎన్ మూర్తి, జేఈ కే.బాబ్జీతో పాటు ఏపీటీడీసీకి చెందిన ఈఈ కె.రమణ, డిప్యూటీ ఈఈ ఏబీవీఎల్ఆర్ స్వామి, ఏఈ పి.మదన్‌మోహన్‌ల సస్పెన్షన్‌కు ఆదేశించింది. అదే విధంగా గోడ నిర్మించిన కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా చందనోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ కోసమంటూ ఏర్పాటు చేసిన కమిటీలో ఉంటూ.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు మంత్రులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.



ఏప్రిల్ 16వ తేదీన చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష చేస్తున్న మంత్రుల కమిటీ

మంత్రులూ ఘటనకు బాధ్యులేగా..?

మూడు రోజుల పాటు విచారణ అంటూ హడావుడి చేసిన త్రిసభ్య కమిషన్ ఏకపక్షంగా వ్యవహరించి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. గోడ ఎవరు కట్టారు?.. ఎందుకు కట్టారు.? దాని వెనక ఎవరు ఉన్నారు.. నిబంధనలు ఏమైనా ఉల్లంఘించారా అనే కోణాల్లో కేవలం అధికారులకు సంబంధించే విచారణ చేపట్టారే తప్ప.. మంత్రుల కోణం నుంచి కించిత్తు దర్యాప్తు చెయ్యలేదు. వాస్తవానికి చందనోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఏప్రిల్ 7వ తేదీన నలుగురు మంత్రులతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, అనగాని సత్యప్రసాద్‌తో పాటు అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా అధికారులున్నారు. కమిటీ నియమించిన తర్వాత నుంచి మంత్రుల బృందం కొండపైనే నిరంతర పర్యటన, సమీక్షలంటూ హడావుడి చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పనులు ఎలా జరుగుతున్నాయో పరిశీలించలేదు.

మంత్రుల కమిటీ సమయంలోనే గోడ నిర్మాణం..!

కాంట్రాక్టరు చెప్పినదాని ప్రకారం చందనోత్సవానికి ఆరు రోజుల ముందే గోడ నిర్మాణం పూర్తయింది. ఏప్రిల్ 16న నిర్మాణ పనులు ప్రారంభించారు. అదే రోజున మంత్రుల కమిటీని ఏర్పాటు చేయడం.. దేవస్థానం అధికారులతో కొండపైనే సమావేశమై సమీక్ష నిర్వహించడం జరిగింది. అంటే గోడ నిర్మాణం గురించి మంత్రుల కమిటీ సమీక్షలో ప్రస్తావన వచ్చే ఉంటుంది. కానీ.. దాన్ని బయటికి రానివ్వకుండా అటు త్రిసభ్య కమిషన్.. ఇటు ప్రభుత్వం కప్పిపుచ్చింది. ఈ గోడ నిర్మాణం జరుగుతున్నప్పుడు కూడా కమిటీ ఏర్పాట్లు పరిశీలనకు పలుమార్లు కొండపై హడావుడి చేసింది. కానీ గోడ నిర్మాణం ఎలా జరుగుతోంది.? నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నారా లేదా అనేది పరిశీలించలేదు. ఇలా ప్రతి అంశంలోనూ మంత్రుల కమిటీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వానికి, త్రిసభ్య కమిషన్‌కు ఏమాత్రం కనిపించకపోవడం గమనార్హం. మొత్తంగా కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు.. విషాద ఘటనలో ప్రభుత్వం తమకు, మంత్రులకు ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా కేవలం అధికారులు, ఉద్యోగుల పైనే చర్యలు తీసుకోవడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం కూడా దేవస్థానం సొమ్మే..!

- సింహాచలం ఆలయంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు దుర్మరణం, ఒకరికి గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల వంతున ప్రకటించిన ప్రభుత్వం
- ఇప్పుడు దేవస్థానం ఖజానా నుంచే బాధితులకు చెల్లింపులు



బాధితులకు చెక్కు అందజేస్తున్న జేసీ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కూటమి ప్రభుత్వం మరోసారి తన బుద్ధి చూపించుకుంది. సింహాచలంలో జరిగిన విషాదానికి గల పరిహారాన్ని దేవస్థానంపై రుద్దేసింది. కొండపై గోడ కూలిన ఘటనలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు దేవస్థానం ఖజానా నుంచే రూ.1.78 కోట్లు చెల్లింపులు చేసింది. చందనోత్సవం రోజున సింహాచలం కొండపై గోడ కూలి ఏడుగురు భక్తులు సజీవ సమాధి కాగా, ఒకరికి గాయపడిన విషయం తెలిసిందే. ఈ మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రుడికి రూ.3 లక్షలు పరిహారంగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హోం మంత్రి అనిత, ఇతర మంత్రులు కూడా హామీలు ఇచ్చేశారు. కానీ ఇప్పుడు దేవాలయం నిధులు కేటాయించడం పట్ల ఆలయ వర్గాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

దేవస్థానం ఖజానా నుంచే చెల్లింపులు

చందనోత్సవం నిర్వహణలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని వామపక్ష, ఇతర ప్రజా సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తున్నాయి. మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అన్ని వర్గాల నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పరిహారాన్ని వెంటనే బాధిత కుటుంబాలకు అందించాలని సింహాచలం దేవస్థానం అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఖజానా నుంచి కాకుండా దేవస్థానం నిధుల నుంచే బాధితులకు చెల్లింపులు చేయాలని తేల్చి చెప్పింది. దీంతో దేవస్థానం అధికారులు ఆగమేఘాల మీద బాధితుల కు చెక్కులు పంపిణీ చేసినట్లు సమాచారం. మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు చొప్పున రూ.1.75 కోట్లు, క్షతగాత్రుడికి రూ.3 లక్షలు చెల్లించారు.

దేవాలయం అభివృద్ధికి వెచ్చించాల్సిన నిధులు

వాస్తవానికి ఘటన జరిగిన రోజున మృతుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని ప్రభుత్వమే నేరుగా ప్రకటించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే ఖజానా నుంచి పరిహారం అందిస్తుందని అందరూ భావించారు. అయితే దేవాలయం అభివృద్ధికి వెచ్చించాల్సిన నిధుల నుంచి పరిహారం కింద బాధిత కుటుంబాలకు అందజేసింది. ప్రభుత్వ ఖజానాపై భారం పడకుండా ఉండేందుకు భక్తులు దేవాలయానికి సమర్పించిన కానుకల నుంచి ఇవ్వడాన్ని ఆలయ వర్గాలు సైతం తప్పుబడుతున్నాయి. దేవాలయం అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు ఇలా పరిహారాల రూపంలో ఇచ్చుకుంటూ పోతే ఆలయ అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వ తీరుపై విమర్శలు

సింహాచలం ఘటనలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు, పరిహారం చెల్లింపులపై వామపక్షాల నుంచే కాకుండా అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి అసమర్థ పాలన కారణంగా జరిగిన ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్ని వర్గాల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో బాధిత కుటుంబాలకు దేవస్థానం ఖజానా నుంచే పరిహారం అందించి ప్రభుత్వం తప్పించుకోడాన్ని తప్పుబడుతున్నాయి. ఇవి ప్రభుత్వ హత్యలే అని, మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. చందనోత్సవ నిర్వహణపై ఐదుగురు మంత్రుల కమిటీ నెల రోజుల పాటు విశాఖలోనే తిష్ట వేసి ఏర్పాట్లు చేసిన వేడుకల్లో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని, దీనికి మంత్రులను కూడా బాధ్యులను చేయాలని పట్టుబడుతున్నారు.

దేవదాయ శాఖ నుంచి వచ్చాయి

దేవదాయ శాఖ నుంచి పరిహారం కింద నిధులు కలెక్టర్ నిధికి వచ్చాయి. వాటిని మాత్రమే బాధిత కుటుంబాలకు చెల్లించాం.

– ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జిల్లా కలెక్టర్

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- నియోజకవర్గాలలో జరిగే పనులు ఎమ్మెల్యేలకు తెలియాలి
- డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర




మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో స్పీకర్ అయ్యన్న, శాసనమండలి విపక్షనేత బొత్స, కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కోతలు లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశానికి ఆయనతోపాటు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గాలలో జరిగే పనుల గురించి ఎమ్మెల్యేలకు తెలియజేయాలని, వారి సలహాలు, సూచనలు అమలుచేయాలన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన రంగాలలో అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ పంచాయతీలకు సరఫరా చేసే బ్లీచింగ్‌లో కాంట్రాక్టర్ రెట్టింపు బిల్లు వసూలు చేస్తున్నాడని, తక్షణమే ఆ కాంట్రాక్టర్‌ను తొలగించాలని కలెక్టర్‌కు సూచించారు. మంచినీటి సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేయడానికి వీలుగా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని తెలిపారు. వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్ నర్సీపట్నంలో కూడా ఏర్పాటు చేయాలన్నారు.

గోవాడ సుగర్స్ రైతులకు బకాయి చెల్లించాలి:బొత్స

శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గోవాడ చక్కెర కర్మాగారం రైతులకు వెంటనే బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు, కార్మికులకు కలిపి సుమారు రూ.40 కోట్ల బకాయిలు ఉన్నాయని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ శ్రామికులకు మార్చి 31 నుంచి వేతనాల బకాయిలు చెల్లించాలన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ప్రసూతి వార్డులో ప్రసవానికి రూ.3 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఒక మహిళ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న సమయంలో బంగారు చెవి దుద్దులు దొంగతనం జరిగిందని, పోలీసులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కె.ఎస్.ఎన్.ఎస్.రాజు మాట్లాడారు. కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ స్థానిక యువతకు పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పించడానికి వారికి నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, విశాఖ మేయర్ శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం రూ.34.80 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు సోమవారం జరిగింది. ఏప్రిల్ 16 నుంచి మే 5వ తేదీ వరకు రూ.34,80,099 నగదు, 27,500 మిల్లీగ్రాముల బంగారం, 601 గ్రాముల వెండి కానుకల రూపంలో వచ్చినట్లు ఆలయ హుండీ పర్యవేక్షకుడు టి.సాంబశివరావు చెప్పారు. హుండీ ఆదాయాన్ని గవరపాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జమ చేశామన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు), ఈవో వెంపలి రాంబాబు, కమిటీ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఫుల్... పరిష్కారం నిల్...

- కలెక్టరేట్ చుట్టూ అర్జీదారుల ప్రదక్షిణలు
- ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాలు లెక్కచేయని మండల స్థాయి అధికారులు
- ముప్పతిప్పలు పెడుతున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- వాపోతున్న అర్జీదారులు



కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలని దేవరాపల్లి మండలానికి చెందిన గిరిజనుల నిరసన

తుమ్మపాల : కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో పలువురి సమస్యలు విని తక్షణమే పరిష్కరించాలని చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలన ఆయా మండలాల అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్‌కే ఫిర్యాదు చేస్తారా... కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కరిస్తారా ? అంటూ అర్జీదారుల పట్ల అధికారులు దురుసుగా మాట్లాడుతూ మరిన్ని కొర్రెలు పెడుతున్నారు. దీంతో అర్జీదారులు బెంబేలెత్తి మళ్లీ మళ్లీ కలెక్టరేట్‌కే పరుగులు తీస్తున్నారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కూడా అలాంటి అర్జీలు అనేకం వచ్చాయి. కలెక్టరేట్ లోపలికి వెళ్లి తమ సమస్యను కలెక్టర్‌కు తెలిపే సౌకర్యం లేక దివ్యాంగులు షరామామూలుగానే అర్జీలతో కలెక్టరేట్ డోర్ వద్దనే వేచియుండి వచ్చిన అధికారికి అర్జీలు సమర్పించారు. సమస్యలపై కలెక్టర్‌కు తెలిపేందుకు వచ్చిన పలు సంఘాలవారిలో ఒక్కరికే లోనికి అనుమతించారు. మొత్తం 278 అర్జీలు వచ్చాయి..

కరెంటు, గుక్కెడు నీళ్లు ఇవ్వలేరా...

స్వతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచిన చీకటిలోనే జీవిస్తూ బతుకులు సాగిస్తున్నామని విద్యుత్ సౌకర్యం కల్పించి తమకు వెలుగులు ఇవ్వాలని కోరుతూ దేవరాపల్లి మండలం చింతలపూడి శివారు పీవీటీజీ కొక్కుల బంద, జారురాయి కొత్త వలస గ్రామాల గిరిజనులు కలెక్టరేట్ వద్ద అడ్డాకులు నెత్తిన పెట్టుకుని తమ నిరసన తెలిపారు. కరెంటు సౌకర్యం కల్పించాలంటూ అనేక మార్లు విద్యుత్‌శాఖ అధికారులకు కాగితాలు పెట్టినా ఎటువంటి ప్రయోజనం లేదని, మంచినీటి సౌకర్యం లేక కలుషిత నీరే తాగుతున్నామని అన్నారు. కలెక్టరమ్మ స్పందించి తమ గ్రామాలకు కరెంటు, మంచినీరు అందించేలా చొరవ చూపాలంటూ పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు.



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు తమ భూ సమస్య వివరిస్తున్న రైతులు

విలేకరి డబ్బు కాజేశాడు...



వ్యవసాయ భూమిని ఆన్‌లైన్ చేస్తానని రూ.1.85 లక్షలు తీసుకుని మోసం చేసిన ఓ ప్రైవేటు సంస్థ విలేకరి పి.శ్రీమాన్ అనే వ్యక్తి నుంచి నగదు ఇప్పించాలని కోరుతూ యలమంచిలి కొత్తపేట వీధికి చెందిన శెలంశెట్టి కనకఅప్పలరాజు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. యలమంచిలిలో తనకు వారసత్వంగా వచ్చిన భూమిని రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆన్‌లైన్ చేయిస్తానని, బదులుగా తన వద్ద నుంచి నగదు తీసుకుని ఆన్‌లైన్ చేయించకుండా నాలుగేళ్లుగా తిప్పించుకుంటున్నాడని తెలిపారు. ఆన్‌లైన్ చేయకపోవడంతో నగదు ఇవ్వమని కోరగా నగదు ఇవ్వకుండా తిరిగి తనను భయపెట్టి, హింసిస్తున్నావంటూ పోలీసు కేసు పెట్టించి జైల్లో పెట్టిస్తానంటూ బెదిరిస్తున్నాడని, అతని నుంచి నగదు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

న్యాయం చేయమంటే పోలీసులతో బెదిరిస్తున్నారు...

వందేళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి తమపై దాడులు చేస్తూ కొందరు నాయకులు ఉపాధి హామీ కూలీలతో చెరువును తవ్విస్తున్నారని, తమ భూమిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ గొలుగొండ మండలం రాజుపేట గ్రామానికి చెందిన రైతులు చిపురుబిల్లి కన్నయ్య, కన్నూరు సత్యనారాయణ తమ వద్ద గల భూమి పత్రాలు, ఆధారాలతో కలెక్టర్‌ను కలిసి ప్రాధేయపడ్డారు. రాజుపేట గ్రామంలో సర్వే నెం.15-1బిలో 3 ఎకరాల ఇనాం భూమి తాతల కాలం నుంచి వారసత్వంగా వచ్చి సాగు చేసుకుంటున్నామని, కూటమి ప్రభుత్వంలో కొందరు నాయకులు రాజకీయ కారణాలతో తమపై కక్ష కట్టి మా ఇరువురికి చెందిన 3 ఎకరాల భూమి చెరువంటూ తమకు చెందకుండా చేస్తున్నారని, అధికార బలంతో పోలీసుల అండతో మా భూముల్లో ఉపాధి పనులు చేస్తూ చెరువు గట్టు వేస్తున్నారన్నారు. ఆక్రమణను అడ్డుకున్న తమపై పోలీసు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. అకారణంగా తమను స్టేషన్‌కు పిలిచి ఫోన్ లాక్కుని ఒక రోజంతా స్టేషన్‌లోనే ఉంచారని, పోలీసులు తాము లేని సమయంలో ఇంటికొచ్చి ఆడవారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. సదరు ఈనాం భూమిపై ఈనాంకు చెందిన పంతులు గారికి తమకు మధ్య కొన్నేళ్లుగా కోర్టు కేసు కూడా నడుస్తుందంటూ వారి వద్ద ఉన్న పత్రాలతో కలెక్టర్‌కు వినతి అందించారు. గత వారం నర్సీపట్నంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ అసహనానికి గురై తమపై దురుసుగా మాట్లాడుతున్నారని, సమగ్ర విచారణ చేసి రైతులుగా తమకు న్యాయం చేయమన్న కలెక్టర్ ఆదేశాలను సైతం పక్కనపెట్టి అదే రోజు తమపై పోలీసు కేసు పెట్టి తీవ్రంగా హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్పీ కార్యాలయంలో 32 అర్జీలు



అర్జీదారుల సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కర వేదికకు సోమవారం 32 అర్జీలు వచ్చాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు ఎస్పీ తుహిన్ సిన్హాకు వినతిపత్రాలు అందించి వారి సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ వంటి వాటిపై అర్జీలు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, సీఐలు బాల సూర్యారావు, అప్పలనాయుడు, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

యువతిపై లైంగికదాడి..!

కేసు నమోదులో పోలీసుల తాత్సారం..

ఎస్.రాయవరం మండలం దార్లపూడి గ్రామానికి చెందిన చుక్కా నాగమణి మాట్లాడుతూ తన స్వగృహంలో గత నెల 29న రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగా తన ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన పప్పల మణికంఠ చొరబడి తన కూతురు ధనలక్ష్మిపై లైంగికదాడికి పాల్పడ్డాడని తెలిపింది. ఈ విషయం తల్లిదండ్రులకు గానీ, ఇంకేవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించాడని కూతురు తెలిపిందని, తాను, భర్త మేడపై నిద్రిస్తుండగా కింద గదిలో పడుకున్న తన కూతురు సుమారు 2 గంటల సమయంలో కేకలు వేయడంతో వెంటనే వెళ్లి అతనిని బంధించి సమీప ప్రజలను పిలిచి పంచాయతీ నిర్వహించి పెళ్లి చేసుకోమని కోరగా అందుకు నిరాకరించాడని తెలిపింది. వెంటనే 30వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అయితే స్టేషన్ అధికారులు ఫిర్యాదు తీసుకోవడానికి తాత్సారం చేస్తున్నారని తెలిపారు. హోం మంత్రి అనిత పీఏ ప్రోద్భలంతోనే ఫిర్యాదు స్వీకరించడంలేదని ఆమె ఆరోపించింది. రెల్లి కులస్థులమయినందున తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, స్థానికంగా న్యాయం జరగకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్టు ఆమె తెలిపింది.

మా భూమిలోకి మమ్మల్ని రానివ్వడం లేదు...



నానాజీ

కశింకోటకు చెందిన కాశిందేవుల నానాజీ మాట్లాడుతూ మాకు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన పాయకరావుపేట మండలం ఈదటం గ్రామంలో 2.5 ఎకరాలు భూమి అన్ని రికార్డులతో కలిగి ఉన్నామని తెలిపారు. ఆ భూమిలోకి వస్తుంటే భూమికి సంబంధం లేని తమ బంధువులు అడ్డుకుంటున్నారని తెలిపారు. ఇదే విషయంపై 2019 నుంచి స్పందనలో ఫిర్యాదు చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. అధికారులు మారినప్పుడల్లా బంధువులు భూమిలోకి వస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. తమకు న్యాయం చేయాలన్నారు.

ఉపాధ్యాయులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

నక్కపల్లి: ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో యలమంచిలి తాలూకా సంఘ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. యలమంచిలి, రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన ఉపాధ్యాయులతో ఏపీటీఎఫ్ యూనియన్ నక్కపల్లి శాఖ అధ్యక్షుడు వై.కృష్ణ ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. సంఘ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటపతిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరించడం తగదన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. 12వ పీఆర్‌సీని తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించాలని కోరారు. డీఎస్సీ నియామకం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై నిరసన తెలియజేస్తున్నామన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ఒక రోజు ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఆందోళనలో ఏపీటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కె.కె.ధర్మారావు, రాష్ట్ర కౌన్సిలర్‌లు డి. కొండలరావు, పి.గణేష్, కె.శ్రీనివాసరావు, ఐదు మండలాల సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కే రామ్‌రహీమ్, పి.శ్రీనివాసరావు, కృష్ణ, అప్పలరాజు, సునీల్, కె.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, కిరణ్, అప్పాజీ, బి.శ్రీనివాసరావు, ఎస్.ఫాల్గుణరావు, కిల్లాడ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

హత్య కేసు మాఫీ యత్నంపై ఎస్పీకి ఫిర్యాదు

- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి
- కేసును వేరొక అధికారికి బదలాయించాలి
- విలేకరులతో మాజీ ఎమ్మెల్యే గణేష్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: హత్య కేసును మాఫీ చేసేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని, కేసును నీరుగార్చేందుకు పోలీసులు సైతం వత్తాసు పలుకుతున్నారని పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హత్యకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఎస్పీని కోరడం జరిగిందన్నారు. ఈ ఏడాది జనవరిలో నర్సీపట్నం మండలం, వేములపూడి గ్రామంలో టీడీపీ కార్యకర్తలు బండారు అప్పన్నపై దాడి చేసి హత మార్చారన్నారు. హత్య చేసిన వ్యక్తులకు కూటమి నాయకుల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. కూటమి నాయకుల ఒత్తిడితో కేసును మాఫీ చేసేందుకు నర్సీపట్నం రూరల్ పోలీసులు చూస్తున్నారన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బిఎన్ఎస్ఎస్(సస్పెసీవ్ డెత్‌గా కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారన్నారు. సంఘటన జరిగి నాలుగు నెలలు అవుతున్నా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు కేసు దర్యాప్తును తప్పుతోవ పట్టించి, కేసును క్లోజ్ చేసేందుకు చూస్తున్నారని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. డాక్టర్ ఇచ్చిన పీఎం రిపోర్టు కూడా హత్యకు అద్దం పడుతుందన్నారు. అయినప్పటికీ పోలీసులు కేసును నీరు గారుస్తున్నారన్నారు. మృతుడు అప్పన్న శరీరంపై బలమైన గాయాలు చూస్తే ప్రమాదవశాత్తూ జరిగింది కాదని, కావాలనే కొట్టి చంపేశారని తెలుస్తుందన్నారు. సమగ్రమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికార పార్టీ నాయకులు ప్రమేయం ఉండడంతో కేసులో నిందితులకు సపోర్టు చేస్తున్నారని ఆరోపించారు. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగాలంటే వేరొక ఆఫీసర్‌కు కేసు బదిలీ చేయాలని ఎస్పీని కోరడం జరిగిందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే న్యాయపోరాటం చేస్తామన్నారు.

'సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించాలి'



నెహ్రూచౌక్‌లో నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

అనకాపల్లి టౌన్: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్‌ఓ)ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని నెహ్రూచౌక్ స్టేట్‌బ్యాంక్ కార్యాలయం ఎదుట 8వ రోజు సమ్మెలో భాగంగా సిహెచ్‌ఓలు మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో పలువురు సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

బొలేరో, ఆటో ఢీ..ఐదుగురికి గాయాలు

- గన్నవరం మెట్ట వద్ద ప్రమాదం
- తీవ్రంగా గాయపడిన ముగ్గురు వైజాగ్ తరలింపు



సంఘటన స్థలంలో గాయాలతో సంతోష్



తీవ్రంగా గాయపడిన కృపానందం

నాతవరం: నర్సీపట్నం తుని మధ్య గన్నవరం మెట్ట వద్ద బొలేరో, ఆటో ఢీకొన్న సంఘటనలో ఐదుగురు గాయపడ్డారు. ఎస్ఐ సిహెచ్.భీమరాజు అందించిన వివరాలివి. నాతవరం మండలం ఎంబీపట్నం గ్రామానికి చెందిన వారు కాకినాడ జిల్లాలో వివాహం సంబంధించి పెద్దలు భోజనానికి ఆటోపై వెళ్లారు. అక్కడ భోజనాలు అనంతరం తిరిగి ఆటోపై ఇంటికి వస్తుండగా నాతవరం మండలం గన్నవరం మెట్ట వద్దకు వచ్చేసరికి నర్సీపట్నం నుంచి తుని వైపు వస్తున్న బొలేరో వ్యాను ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎంబీ పట్నం గ్రామానికి చెందిన సలగాల సంతోష్, అడ్డాల కృపానందం, పెద్దాడ మరిడియ్య, కోరుబిల్లి దుర్గ, కె.చినరాజుబాబు గాయపడ్డారు. వీరిని వెంటనే వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో సలగాన వసంతకు కుడి కాలికి, కృపానందం ముఖంపైనా, మరిడియ్యకు ఎడమ చేతికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు. నాతవరం పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి నర్సీపట్నం తుని అర్‌అండ్‌బీ రోడ్డుపై ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భీమరాజు తెలిపారు.

హేచరీ బస్సు, ఆటో ఢీ

10 మందికి గాయాలు



గాయపడిన మహిళను నర్సీపట్నం తరలిస్తున్న దృశ్యం

కోటవురట్ల: కోటవురట్ల నుంచి ఎస్.రాయవరం మండలం ధర్మవరం వెళుతున్న హెచరీకి సంబంధించిన బస్సును, అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల వస్తున్న ఆటో ఢీకొనడంతో 10 మంది గాయపడ్డారు. మండలంలోని పాత రోడ్డు జంక్షన్ దాటాక జరిగిన ఘటనలో క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పి.లక్ష్మి అనే మహిళను మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. నర్సీపట్నంలో ఎస్.నూకరత్నం, జి.నాగపద్మ చికిత్స పొందుతుండగా కోటవురట్ల సీహెచ్‌సీలో కె.నాగ తేజ, డి.సోమన్న, కె.వెంకటలక్ష్మి, జి.అమ్మాణి, పి.రాజులమ్మ, ఆర్.శాంతి, వై.శ్రీనులకు ప్రథమ చికిత్స అందించారని ఎస్ఐ రమేష్ తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ... ఒకరికి గాయాలు



అపస్మారక స్థితిలో రోడ్డుపై పడి ఉన్న శ్రీనివాస్

అచ్యుతాపురం రూరల్: రామన్నపాలెం గ్రామానికి చెందిన ధర్మిరెడ్డి శ్రీనివాసరావును లారీ ఢీకొనడంతో తీవ్ర రక్త స్రావమై అపస్మారక స్థితిలో ఉన్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం క్షతగాత్రుడు శ్రీనివాస్ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తించుకుని అచ్యుతాపురం కూడలి నుంచి రామన్నపాలెం తన ఇంటికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో రోడ్డుపై పడి ముక్కు, నోటి నుండి తీవ్రంగా రక్త స్రావమైంది. లారీ క్షతగాత్రుని ఢీకొని ఆపకుండా వెళ్లిపోవడం గమనించిన స్థానికులు లారీని వెంబడించి పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు. రోడ్డుపై పడి తలకు బలంగా గాయం కావడంతో విశాఖలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

ఏటికొప్పాక బొమ్మల తయారీకి చేయూత



హస్త కళాకారులతో మాట్లాడుతున్న అధికారులు

యలమంచిలి రూరల్: ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు పంచాయతీరాజ్ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(పీఆర్‌జీఎస్‌ఏ) రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ తెలిపారు. ఆయన అధికారులతో కలిసి సోమవారం ఆర్టిజెన్స్ కాలనీలో హస్త కళాకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ రాజు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీశైలపు చిన్నయాచారి, పెదపాటి శరత్, సంతోష్ కుమార్ సహా పలువురితో సమావేశమయ్యారు. లక్కబొమ్మల తయారీలో సరికొత్త మెలకువలు నేర్పించడానికి కళాకారులకు శిక్షణ ఇవ్వనున్నారు. తమకు విద్యుత్ బిల్లుల్లో రాయితీ కావాలని, అంకుడు కర్రల డిపోను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, రంగుల ధరలు తగ్గించాలని కళాకారులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కళాకారులను ప్రోత్సహించేందుకు రూ.5 కోట్లతో కొత్త ప్రాజెక్టు మంజూరు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎంపీడీవో కొండలరావు, ఏవో ప్రసాదరావు,ఈవోపీఆర్డీ దీపిక, ఏటికొప్పాక పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయితో ఇద్దరు అరెస్ట్



పట్టుకున్న నిందితులను చూపిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట గ్రామ శివారులో లిక్విడ్ గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నామన్నారు. వీరి వద్ద రెండున్నర కిలోల లిక్విడ్ గంజాయి పట్టుకుని సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామని, వీరి వెనుక ఉన్న నిందితుల గురించి విచారణ చేస్తున్నామన్నారు.

శంకరంలో వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందిన జితిన్

అనకాపల్లి టౌన్: మండలంలోని శంకరం గ్రామంలో సోమవారం ఒక వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందాడని రూరల్ ఎస్ఐ జె.నాగేశ్వరావు తెలిపారు. గ్రామంలో ఒక వ్యక్తికి చెందిన మూసి ఉన్న కోళ్ల ఫారం వద్ద చింతచెట్టుకు ఉరివేసుకొని ఉండగా సమీపంలోని పిల్లలు గమనించి గ్రామ పెద్దలకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. మృతుని ఫ్యాంట్ జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా త్రిపుర రాష్ట్రానికి చెందిన జితిన్ ముండా(39)గా గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



కమిషనర్ ప్రసాదరాజుకు సమ్మె నోటీసు ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

యలమంచిలి రూరల్: ఈ నెల 20వ తేదీన ప్రారంభం కానున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో పని చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేయనున్నట్టు తెలియజేస్తూ మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజుకు మున్సిపల్ కార్మికులు సమ్మె నోటీసు సోమవారం అందజేశారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగాల్లో పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు చేయాలని,కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలన్న పలు డిమాండ్లతో సమ్మెకు దిగుతున్నట్టు నోటీసులో పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు గనిశెట్టి ఏసుదాసు,మున్సిపల్ వర్కర్ల సంఘం నాయకులు వై.నూకరాజు, సీహెచ్.వెంకటరమణ, సూరిబాబు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి ప్రతిభ



బంగారు పతకాలు, సర్టిఫికెట్ అందుకుంటున్న నాగజ్యోతి

రావికమతం: కొత్తకోటకు చెందిన ఉపాధ్యాయిని పి.ఎం.ఎన్.నాగజ్యోతి పాన్ ఇండియా మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి నాలుగు విభాగాల్లో బంగారు పతకాలు సాధించింది. కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో 4వ నేషనల్ పాన్ ఇండియా మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ -2025 పోటీలు ఈ నెల 3,4 తేదీలలో జరిగాయి. నాగజ్యోతి మహిళల విభాగంలో బెంచ్ ప్రెస్, స్క్వాట్, డెడ్ లిఫ్ట్ విభాగాలు మూడింట్లోనూ, ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లోను కలిపి నాలుగు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. ఛాంపియన్‌షిప్ నిర్వాహక కమిటీ ప్రెసిడెంట్ దీపుదేవ్, మిస్టర్ ఇండియా టైటిల్ విన్నర్ వి.ఎన్.షాజీ చేతుల మీదుగా నాగజ్యోతి అందుకున్నారు. కొత్తకోట గ్రామానికి చెందిన నాగజ్యోతి ప్రస్తుతం రోలుగుంట హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు బంగారు పతకాలు సాధించిన నాగజ్యోతి ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, వాసవీ వనితా క్లబ్ సంఘం మహిళలు, గ్రామస్తులు అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా, జైలుశిక్ష

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత పది రోజుల్లో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 37 మందికి జరిమానా, ఏడుగురికి జైలుశిక్ష విధించినట్టు యలమంచిలి పట్టణం, ట్రాఫిక్ ఎస్ఐలు కె. సావిత్రి, బి.రామకృష్ణ సోమవారం సాయంత్రం మీడియాకు తెలిపారు. పట్టణ ఠాణా పరిధిలో నమోదైన 13 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులను కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ1.30 లక్షల జరిమానా విధించినట్టు తెలిపారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 31 కేసులు నమోదు చేయగా వారిలో 24 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.2.40 లక్షల జరిమానా, ఏడుగురు నిందితులకు ఒక్కొక్కరికి నాలుగు రోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ వాహన చోదకులకు పలు సూచనలు,హెచ్చరికలు జారీ చేశారు.

క్లుప్తంగా

8 నుంచి కల్యాణోత్సవాలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మెయిన్‌రోడ్ సిద్ధి లింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు గోకర్ణేశ్వరస్వామి బాల త్రిపుర సుందరీదేవి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ అమరపల్లి కృష్ణాజీ తెలిపారు. 8న విఘ్నేశ్వర పూజ, సాయంత్రం ఎదురు సన్నాహాలు, రాత్రి కల్యాణం జరుగుతుందన్నారు. 9న కల్యాణ పంచ శోభా హారతులు, 10న సాయంత్రం నద స్యం(పండిత గోష్ఠి), 11న నాగవల్లి కార్యక్రమం, 12న పుష్పాంజలి, ప్రతీరోజు సాయంత్రం శివకూటమి భక్త బృందంతో భజన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు రేపు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో వాసవీ మాత అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి పట్టణంలో 1925వ సంవత్సరంలో అమ్మవారి ఆలయాన్ని ప్రారంభించామన్నారు. అమ్మవారి పల్లకి ఊరేగింపు, తిరువీధి మహోత్సవం, గోపూజ, శ్రీనగరేశ్వర స్వామి, జనార్దన్ స్వామికి అభిషేకాలు, ఆలయ మండపంలో ఉత్సవ మూర్తికి బియ్యంతో అభిషేకం, లక్ష మల్లెపూలతో అర్చన, సామూహిక లలిత సహస్ర నామ పారాయణం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, వాసవీ మాతకు 102 రకరాల స్వీట్లతో నైవేద్యం, వెండి రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, రాత్రికి ఊంజల్‌సేవ, కోలాటం వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఆర్డీవో ఆయిషాకు ఎన్‌ఎంయూఏ వినతి



ఆర్డీవో ఆయిషాకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

అనకాపల్లి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొద్ది రోజులుగా పోరాడుతున్నా పరిష్కారం చూపకపోవడమే కాకుండా కక్ష సాధింపు చర్యలకు ఆర్టీసీ యాజమాన్యం పాల్పడుతోందని డిపో కార్యదర్శి పిల్లా సుధాకర్ ఆరోపించారు. ఈ మేరకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఆయిషాను సోమవారం కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎన్.రావు, రమేష్, వేపాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా తప్ప మిగిలిన కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో టమాటా రూ.20 నుంచి రూ.30కి పెరిగింది. బంగాళాదుంప, ఉల్లిపాయ, దొండకాయ, బెండకాయ, వంకాయ, క్యాబేజి కూడా రూ.30కి అమ్మకాలు సాగాయి. బరబాటి రూ.40, బీట్రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు జరిగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 340 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,250	4,770
రెండో రకం	3,860	4,350
మూడో రకం	3,300	3,700

అనకాపల్లి సినిమాలు

రాజా : రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : థండర్ బోల్ట్స్
పర్తిసాయి : హిట్-3
షిర్డీసాయి : ఓదెల 2
వెంకటేశ్వర : జింఖానా
శ్రీసత్య : సారంగపాణి జాతకం
రామచంద్ర : తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 336 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ లో సంప్రదించవచ్చు.



మురుగు కాలువ పక్కనే రైతుల విక్రయాలు



అధ్వానంగా మార్కెట్ ప్రవేశ మార్గం



మార్కెట్ లోపల కుప్పగా పడేసిన కుళ్లిన కూరగాయలు

గాంధీ మార్కెట్‌లో సమస్యల తిష్ట

- క్షీణించిన పారిశుధ్యం
- కానరాని మరుగుదొడ్లు
- తాగునీటికీ కటకట
- వర్షం పడితే దుర్గంధభరితం



మహాత్మగాంధీ కూరగాయల మార్కెట్



మార్కెట్‌లో షాపులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గాంధీ మార్కెట్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. క్షీణించిన పారిశుధ్యం, కానరాని మరుగుదొడ్లు, తాగునీటి కొరత వేధిస్తున్నాయి. వర్షం పడితే మార్కెట్‌లో అడుగు పెట్టే పరిస్థితి కనిపించడం లేదు. ఈ మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలు జరుగుతుంటాయి. సమీప గ్రామాల నుంచి రైతులు తాము పండించే వివిధ రకాల ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. నిత్యం వేలాది మంది వినియోగదారులు సైతం మార్కెట్‌కు వస్తుంటారు. కొనుగోళ్లు, అమ్మకాలు పెద్ద సంఖ్యలో జరుగుతుంటాయి. ప్రభుత్వానికి కూడా భారీగానే ఆదాయం వస్తుంది. అయినా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు తెల్లవారుజామున రెండు, మూడు గంటల నుంచి కూరగాయలు తీసుకొస్తుంటారు. వీటిని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఉదయం ఐదు, ఆరు గంటల వరకు కొనుగోలు చేస్తారు. తర్వాత సమయం నుంచి వినియోగదారులు వస్తుంటారు. అలాగే వివిధ రాష్ట్రాల నుంచి లారీలతో ఉల్లిపాయలు, టమాటాలు, క్యాబేజీ, దొండకాయలు తదితర కాయగూరలు రాత్రి వేళల్లో దిగుమతి అవుతాయి. వీరందరితో నిత్యం మార్కెట్ రద్దీగా ఉంటుంది. వీరి అవసరాల తగట్టు ఇక్కడ సదుపాయాలు లేవు. దాహం వేస్తే మంచినీరు దొరకదు. అత్యవసరమైతే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి. ఇక వర్షం పడితే బజారులో అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంది. హోల్‌సేల్ వ్యాపారులు తమ మిగిలిపోయిన ఉత్పత్తులను షాపుల ముందే పడేస్తుంటారు. రోజుల తరబడి అవి అలాగే ఉండిపోతాయి. ఎప్పటికప్పుడు ఎత్తాల్సిన జీవీఎంసీ సిబ్బంది వాటిని సకాలంతో తొలగించడం లేదు. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలు పూడికతో నిండిపోయాయి. మరుగునీరు పారే పరిస్థితి లేదు. దీంతో మురుగు మధ్యనే రైతులు తమ ఉత్పత్తులను విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మార్కెట్‌లో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి



తాగునీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నాం. కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి.

– దాడి వరలక్ష్మి, చిల్లర వర్తకుల సంఘం అధ్యక్షురాలు, గాంధీ మార్కెట్

కాలకృత్యాలకు ఇబ్బంది..



దూర ప్రాంతాల నుంచి వచ్చే తమకు అత్యవసర పరిస్థితిలో చాలా ఇబ్బంది పడుతున్నాం. కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేవు. ప్రతి రోజు ఆశీలు చెల్లిస్తున్నా సౌకర్యాలు కల్పించడం లేదు.

– కాండ్రేగుల లక్ష్మి, రైతు, ఉమ్మలాడ

వ్యర్థాల మధ్యే విక్రయాలు



మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేవు. వర్షం వస్తే బజారు అంతా బురదమయంగా మారుతుంది. కుళ్లిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఎత్తడం లేదు. వ్యర్థాల మధ్యే కూరగాయల విక్రయాలు చేపడుతున్నారు.

– అల్లు ప్రకాష్‌రావు, వినియోగదారుడు, అనకాపల్లి

'అద్దె భవనాల్లో కొనసాగడం తగదు'

అనకాపల్లి టౌన్: పట్టణంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగించడం తగదని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరనాథ్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు చెల్లిస్తున్న అద్దెతో సొంత భవనాలు కట్టుకోవచ్చన్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

అనకాపల్లి టౌన్:అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ క్రైం ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. కస్పా వీధికి చెందిన శ్రీరందాసు వీర్రాజు ఎటువంటి రసీదులు లేకుండా 15 మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుబడ్డాడు. ఈ మేరకు ఆయనను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నైతిక విలువలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న తాళ్లపాలెం గ్రంథాలయ అధికారి జగన్నాథం

కశింకోట: విద్యార్థులు నీతి, నిజాయితీతో మెలగాలని, నైతిక విలువలు అలవర్చుకోవాలని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయాధికారి కె.జగన్నాథం కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం 5వ రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం, పత్రిక పఠనం చేయాలన్నారు. దీని వల్ల విజ్ఞానదాయకమైన విషయాలు తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులతో కథలు చెప్పించడంతో పాటు పుస్తక పఠనం కూడా నిర్వహించారు.

ఈసారీ కంది పప్పు లేదు..



రేషన్‌లో పంపిణీ చేసిన పంచదార ప్యాకెట్‌ను చూపిస్తున్న లబ్ధిదారు

కశింకోట: మండలంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఈ నెలలో కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కేవలం బియ్యం, పంచదార పంపిణీకే పరిమితమవుతోంది. గత ఐదు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. గత ఏడాది డిసెంబర్ నెలలో మాత్రం కందిపప్పు ఇచ్చారు. సంక్రాంతికి కంది పప్పు ఇచ్చారు. ఆ తర్వాత దాని ఊసే లేదు. దీంతో పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బయట మార్కెట్‌లో కిలో రూ.120 వరకు ధర ఉందని, అదే కోటాలో అయితే రూ.67కే లభించేదంటున్నారు. దీని దృష్ట్యా కందిపప్పుతో పాటు గోధుమలు, రాగులు రాయితీపై అందివ్వాలని, గతంలో ఇచ్చే పామాయిలు కూడా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'అంగన్‌వాడీ కార్యకర్తపై వేధింపులు తగవు'



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పరవాడ: రావాడ అంగన్‌వాడీ కార్యకర్తపై వేధింపులకు పాల్పడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడులపై చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సిటు ఆధ్వర్యంలో మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు సోమవారం ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం గనిసెట్టి మాట్లాడుతూ రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు అంగన్‌వాడీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ నెల 2న గ్రామంలో నిర్వహించిన కిశోర వికాస కార్యక్రమానికి, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తకు ఎలాంటి సంబంధం లేకపోయినా సదరు అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తన రాజకీయ ఆధిపత్యం కోసం అంగన్‌వాడీ కార్యకర్తను బలిచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి ద్వారా మెమో జారీ చేయించి, సోషల్ మీడియాలో అన్ని గ్రూపులకు పంపించి అంగన్‌వాడీ కార్యకర్తను వేధిస్తున్న సర్పంచ్, సీడీపీవోపై విచారణ జరిపి, శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సీహెచ్ దేవి, ఎం.అమ్మాజి, రత్నం, వెంకటలక్ష్మి, పార్వతి, రాణి పాల్గొన్నారు.

పశు సంవర్ధక అధికారుల సంఘం కార్యదర్శిగా గంగాధర్



మధుమురళీ గంగాధర్

యలమంచిలి రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారుల సేవా సంఘం జనరల్ సెక్రటరీగా యలమంచిలి పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ చల్లా మధు మురళీ గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం పశుసంవర్ధక జేడీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో గంగాధర్‌ను సంఘం కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల సోమవారం యలమంచిలి పశుసంవర్ధక ప్రాంతీయ ఆస్పత్రిలో పలువురు పశు వైద్యాధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. సంఘం బలోపేతానికి, పశు సంవర్ధక శాఖ అధికారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్టు గంగాధర్ సాక్షికి తెలిపారు.

పాయకరావుపేట పీహెచ్‌సీలో తనిఖీలు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డీఎంహెచ్‌వో బాలాజీ

పాయకరావుపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌సీడీ సర్వే, ఈసీ సర్వే, టీబీ, హెచ్‌ఐవీలపై సమీక్ష నిర్వహించారు. ఎండలు కారణంగా వడదెబ్బ, అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల పట్ల జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్, ఈవో పి.వి.రమణ, హెచ్ఎస్ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎం.కోడూరు మోదమాంబ జాతర

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామ ప్రధాన ఆరాధ్య దైవం, మోదమాంబ అమ్మవారి జాతర ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద నేలవేషాలు, బండ్ల వేషాలు, మహిళలు కోలాటం, కంజరీ నృత్యాలతో జాతర ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. తర్వాత వర్షం ఆగిపోవడంతో జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఇతర ప్రతినిధులు తగు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జాతర ముగింపు సందర్భంగా భక్తులకు మజ్జిగ, ప్రసాదం దాతలు సహకారంతో అందించారు. ఈ సందర్భంగా గ్రామం అంతా విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు.

8న బ్రాహ్మణి ముత్యమాంబ పండగ



బ్రాహ్మణి ముత్యమాంబ

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో కొలువుదీరిన బ్రాహ్మణి ముత్యమాంబ పండగను ఈ నెల 8న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆ రోజు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే అశేష భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం అమ్మవారిని పుర వీధుల్లో డప్పువాయిద్యాలు నడుమ ఊరేగించి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

పరవాడ: దొంగతనాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచించారు. గొర్లివానిపాలెం పోర్టుకో లేఅవుట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దొంగతనాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు గృహ సముదాయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారికంగా అనుమతి పొందిన యాప్స్‌ను మాత్రమే ఉపయోగించాలన్నారు. బెట్టింగ్ యాప్స్‌ను వినియోగించ కూడదన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే 1930 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. సదస్సులో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, పోర్టుకో కమ్యూనిటీ అధ్యక్షుడు ఇ.కాశీప్రసాద్, కార్యదర్శి అమరేంద్ర, కాలనీ వాసులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట: కశింకోటలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో మధ్యాహ్నం పేదలకు అన్నసమారాధన నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు గాయాలు



గాయపడిన కోటి

మునగపాక: మండలంలోని గంగాదేవిపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. టి.సిరసపల్లికి చెందిన పొలమరశెట్టి కోటి సోమవారం తన బైక్‌పై మునగపాక మీదుగా అనకాపల్లి వెళ్తున్నాడు. గంగాదేవిపేట జంక్షన్ సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటోను తప్పించబోయి బైక్ బోల్తా పడింది. దీంతో కోటి కిందపడిపోయి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో ఆయనను అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త కాలనీల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు

అనకాపల్లి: రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర ఒత్తిడికి గురవుతుందని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కొణతాల గణేష్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుంచి 5 తరగతులను మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగించాలన్నారు. ఇప్పటికే ఉన్న 6 నుంచి 10 లేదా 12 తరగతుల ఉన్న పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎం, పీడీ పోస్టు మంజూరు చేయాలన్నారు. 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండో సెక్షన్, ఆపై ప్రతి 35 మందికి ఒకటి చొప్పున సెక్షన్ల ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుడికి వారానికి 32 పీరియడ్ల వర్క్‌లోడ్‌కు మించకుండా స్టాఫ్ ప్యాటర్న్ కొనసాగించాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీ, కార్పొరేషన్, నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీల్లో ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీని వెంటనే నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలతో పాటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్న అన్ని రకాల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు డి.నూకేష్, బేగం, సూర్యనారాయణ, పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్‌కు సత్కారం



శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అమర్‌నాథ్, ధర్మశ్రీ తదితరులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ పరవాడ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితుడైన మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన బండారు శ్రావణ్‌కుమార్‌ను పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ శాలువ కప్పి, సత్కరించారు. సబ్బవరంలో ఆదివారం రాత్రి జరిగిన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన అమర్‌నాథ్ చేతుల మీదుగా శ్రావణ్‌కుమార్‌కు సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేసి, పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని శ్రావణ్‌కుమార్‌కు సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నాయకత్వంలో పార్టీ పురోభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శ్రావణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తరచూ విద్యుత్ కోతలతో అవస్థలు

కశింకోట: మండలంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా సాయంత్రం సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. రైతులు, కూలీలు పగలు పని చేసుకుని తిరిగి ఇళ్లకు సాయంత్రం చేరుకుంటారు. వంట, ఇంటి పనులు చేసుకునే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. ఒక వైపు విద్యుత్ మరమ్మతుల పేరుతో పగటి పూట విద్యుత్ సరఫరా నిలిపి వేస్తూ, సాయంత్రం, రాత్రి సమయాల్లో కోతలు విధిస్తుండటంపై వినియోగదారులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా కశింకోట ప్రాంతంలో సోమవారం హైఓల్టేజీ కారణంగా నాలుగు ఛార్జర్లు, ఇతర సామగ్రి కాలిపోయినట్లు స్థానిక సెల్‌ఫోన్ దుకాణ నిర్వాహకుడు తెలిపారు. ఫ్రిజ్ కాలిపోయిందని మరో పాల వ్యాపారి తెలిపారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా సవ్యంగా సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.